అవిశ్రాంత మాస్టారుకు

అత్యుత్తమ పురస్కారం

- నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ముందుకు..
- విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు
- 53 సైన్స్‌ఫెయిర్ ఆవిష్కరణలతో గుర్తింపు
- దమ్మన్నపేట పాఠశాల టీచర్‌కు జాతీయస్థాయి పురస్కారం
- 5న ఢిల్లీలో స్వీకరించనున్న సంపత్‌కుమార్

ఆయనో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. చిన్నప్పటి నుంచి శాస్త్రవేత్త కావాలని కలలుగన్నారు. తన లక్ష్యం నెరవేరక పోవడంతో పాఠశాలలో చదివే విద్యార్థులతో ఆవిష్కరణలు చేయిస్తున్నారు. మిషన్-100 ఆవిష్కరణలే లక్ష్యంగా పెట్టుకున్నారు. తన 23ఏండ్ల సర్వీస్‌లో అవిశ్రాంతంగా 53 ఆవిష్కరణలు రూపొందించారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం ప్రకటించింది. ఈ నెల 5న ఢిల్లీలో అవార్డు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ సేవలపై ప్రత్యేక కథనం..

- గంభీరావుపేట, సెప్టెంబర్ 3

2023లో ఢిల్లీలో ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్‌లో ప్రాజెక్టు గురించి రాష్ట్రపతికి వివరిస్తున్న విద్యార్థిని, పక్కన టీచర్ సంపత్‌కుమార్ (ఫైల్)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంపత్‌కుమార్ చిన్నతనం నుంచి శాస్త్రవేత్త కావాలని భావించాడు. తీరా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాడు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాడు. 2001 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించి 2012లో భౌతిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. 2022లో దమ్మన్నపేట పాఠశాలకు బదిలీపై వచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులతో స్థానిక సమస్యలపై అందుబాటులో ఉన్న పరికరాలతో పలు ఆవిష్కరణలు రూపొందించి పలు పురస్కారాలు పొందారు.

23ఏండ్ల సర్వీస్.. 53ఆవిష్కరణలు

విద్యార్థులను గొప్ప ఆవిష్కర్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో మిషన్-100 ఎంచుకున్నారు. అందులో భాగంగా తన 23 ఏండ్ల సర్వీస్‌లో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో కొత్తగా 53ఆవిష్కరణలు రూపొందించారు. ఈ క్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా 2017లో జిల్లా స్థాయిలో, 2020లో రాష్ట్రస్థాయి, 2024లో జాతీయ స్థాయి పురస్కారాన్ని సంపత్‌కుమార్ సొంతం చేసుకున్నారు. అంతే కాకుండా సైన్స్ ఫెయిర్‌లో 2018 నుంచి వరుసగా స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు

ప్రయోజనకరంగా ఆవిష్కరణలు

ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ విద్యార్థులతో తయారుచేయించిన సైన్స్‌ఫెయిర్ ఆవిష్కరణలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనకరంగా.. ఆయా కంపెనీలకు ఆదర్శంగా నిలిచాయి. అందులో కొన్ని.. వంట మిత్ర పరికరంతో ఉపయోగించి బరువైన పాత్రలతో ఒక్కరే ఎత్తి సులువుగా వంట చేయవచ్చు. వెల్డింగ్ పని చేసేప్పుడు చెడు వాసన పీల్చకుండా హెల్మెట్‌కు ముందరి భాగంలో చిన్నపాటి ఫ్యాన్ అమర్చి మాస్క్ లోటు తీర్చే విధమైన పరికరాన్ని ఆవిష్కరించి రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించారు. వాటితో పాటు సంపత్‌కుమార్ నిరంతర కృషితో విద్యార్థులు రూపొందించిన 53 ఆవిష్కరణల్లో 8అంతర్జాతీయ, 15 జాతీయ, 30రాష్ట్ర స్థాయి స్థాయిలో పురస్కారాలు అందుకున్నారు.

వంటమిత్ర ప్రాజెక్టు గురించి కేరళలో విద్యార్థినితో కలిసి జాతీయ స్థాయి ప్రదర్శన చేస్తున్న టీచర్ సంపత్‌కుమార్ (ఫైల్)

ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

23ఏండ్ల సర్వీస్‌లో 53ఆవిష్కరణలు రూపొందించా. తాను పదవీవిరమణ పొందే వరకు గ్రామీణ ప్రాంతానికి చెందిన 100మంది విద్యార్థులను ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్‌డెక్స్‌లో ప్రస్తుతం దేశానికి మొదటి స్థానానికి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తా. మన శాస్త్రవేత్తలు ప్రపంచానికే ఆదర్శంగా ఉండాలన్నదే తన ఆశయం. ప్రదర్శనలతో జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగింది.

- సంపత్‌కుమార్, జాతీయ స్థాయి ఉత్తమ టీచర్(గంభీరావుపేట)

ప్రాజెక్టులకు జలకళ

- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ఉధృతంగా ప్రవహిస్తున్న మూలవాగు, మానేరువాగులు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తళ్లు దుంకుతున్న చెరువులు, కుంటలు
- గెరువిచ్చిన వర్షం.. ఊపిరిపీల్చుకున్న ప్రజలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. మధ్య, ఎగువ మానేరు ప్రాజెక్టులతోపాటు అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా.. చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయి. మూడు రోజులపాటు జనజీవనాన్ని అతలాకుతలం చేసిన వర్షం మంగళవారం గెరువియ్యడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈ క్రమంలో మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చర్యలు చేపట్టారు.

అలుగుపారుతున్న చెరువులు

జిల్లా వ్యాప్తంగా 656 చెరువులుండగా, అందులో 138 వంద శాతానికి పైగా నిండి మత్తళ్లు దుంకుతున్నాయి. 320చెరువులు వందశాతం నీటితో నిండుకుండలా మారాయి. మరో 198చెరువులు 75శాతం నిండినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి నుంచి మొదలైన మూలవాగు, గంభీరావుపేట మండలం నర్మాల నుంచి మొదలైన మానేరువాగులు పొంగిపొర్లుతున్నాయి. వేములవాడ నుంచి హన్మాజీ పేట గ్రామాల మధ్య నక్కవాగు దాటనివ్వడం లేదు. మానేరువాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నది. గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామాలకు, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె, పదిర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ, సిరిసిల్ల వాగులు పొంగిపొర్లుతూ మధ్యమానేరులోకి చేరుకుంటున్నాయి.

గెరువిచ్చిన వర్షం..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షం మంగళవారం గెరువియ్యడంతో జిల్లా ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా కూడెల్లి వాగుల నుంచి గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరులోకి 8వేల క్యూసెక్కుల వరద రావడంతో మానేరు నిండి మత్తడి దుంకుతున్నది. మూలవాగుల నుంచి 10,660 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 7వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మధ్యమానేరులోకి వచ్చి చేరుతున్నది. అలాగే ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల వరద వస్తుండగా, 6,550 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ముస్తాబాద్: మత్తడి దుంకుతున్న బంధనకల్ ఊర చెరువు

సహాయక చర్యలు ముమ్మరం

జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు ముమ్మరం చేపట్టింది. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చెరువులు, కుంటలు, ప్రాజెక్టులను సందర్శించింది. రహదారులు, బ్రిడ్జిలు, కాలువల వద్ద తనిఖీలు చేపట్టింది. పొంగుతున్న వాగులు, ప్రాజెక్టుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రమాద స్థాయిలో పొంగుతున్న వాగుల వద్ద నుంచి ఎవరినీ పోనివ్వకుండా చర్యలు తీసుకున్నది. ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, సిరిసిల్ల మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 3: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 13,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 6,550 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఎల్‌ఎండీకి వెళ్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 20.76 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

మత్తడి దుంకుతున్న చెరువులు

ముస్తాబాద్, సెప్టెంబర్ 3: బంధనకల్ ఊర చెరువు, తెర్లుమద్ది రేకుల చెరువు, ఆవునూరి పెద్ద చెరువు, నామాపూర్ మల్లాడి చెరువు, వెంకట్రావుపల్లి పులిచెరుకుంట, బోరుకుంట, కొత్తకుంట చెరువులు మత్తళ్లు దుంకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లో 11ఇండ్లు కూలిపోయాయని అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న క్రమంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగును ఆవునూరు, రామలక్ష్మణులపల్లెతోపాటు పరిసర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఎర్రకుంటకు బుంగ

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని ఎర్ర కుంటకు మంగళవారం బుంగ పడింది. నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి బుంగను పూడ్చాలని కోరుతున్నారు. అలాగే భారీ వర్షాలకు అనంతారం చెరువు మత్తడి దంకుతున్నది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మండల కేంద్రంలోని ఎర్రకుంటకు పడిన బుంగ

ఉధృతంగా మానేరు వాగు ప్రవాహం

గంభీరావుపేట, సెప్టెంబర్ 3: లోలెవల్ వంతెనలపై మానేరు వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మూడు రోజుల నుంచి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి 12వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో మత్తడి నుంచి పరవళ్లు తొక్కడంతో మానేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గంభీరావుపేట-లింగన్నపేట, కోళ్లమద్ది, కొత్తపల్లి, శ్రీగాధ, ముచ్చర్ల గ్రామాలకు రవాణా వ్యవస్థ నిలిచిపోయింది.

ముస్తాబాద్: రామలక్ష్మణులపల్లె వద్ద నీట మునిగిన రామాలయాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- శాంతి కమిటీ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

కలెక్టరేట్, సెప్టెంబర్ 3: జిల్లాలో గణేశ్ నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. గణేశ్ విగ్రహాల మండపాల బాధ్యులు, హిందూఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం, క్రైస్తవ ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రజలంతా ఐక్యమత్యంతో గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం అయ్యేదాకా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ఈ నెల 7న మొదలు కానున్న గణేశ్ నవరాత్రోత్సవాలు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలోవినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుద్దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని కమిషనర్లు ఆదేశించారు. సెస్ అధికారులు వినాయక మండపాలు, నిమజ్జనం రోజున విగ్రహాలు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడలో 18మంది చొప్పున జాలర్లను నియమిస్తామని ఆ శాఖ అధికారులు తెలుపగా, మరో పది మందిని రిజర్వ్‌లో వుంచి, లైఫ్‌జాకెట్లు సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 108, 24/7 క్విక్ రెస్పాన్స్ టీంలు, మందులు అందుబాటులో ఉంటాయని డీఎంహెచ్‌వో వసంతరావు తెలిపారు. ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపం, విగ్రహం ఎత్తు, ఏ రోజున నిమజ్జనం చేస్తారో వివరాలు ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఆయా తేదీల్లో విగ్రహాలను నిర్ణీత సమయానికి తరలించి, నిమజ్జనం చేసేలా అందరూ సహకరించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్‌లో నీరు, ఇసుక నిల్వ ఉంచాలని సూచించారు. పోలీస్ శాఖ వెబ్‌సైట్ (https://policeportal.tspolice.gov.in/index.htm)లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. ఇక్కడ వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీబేగ్, సంపత్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

కోనరావుపేట, సెప్టెంబర్ 3: బావుసాయిపేటకు చెందిన షేక్‌గోరిబికి మంగళవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. సిబ్బంది దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో షేక్‌గోరిబికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. ఆశ కార్యకర్త బాబాయి, పైలెట్ చాణక్య, ఈఎంటీ గణేశ్ చాకచక్యంగా వ్యవహరించి గోరిబికి ప్రసవం చేయగా, పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే వారిని వేములవాడలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సకాలంలో డెలివరీ చేసిన అంబులెన్స్ సిబ్బంది, ఆశ కార్యకర్తకు గోరెబి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

5న ఉత్తమ టీచర్లకు సన్మానం

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 3: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఈ నెల 5న జిల్లాస్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు తెలిపారు.

దుండ్రపల్లి చెరువు పరిశీలన

బోయినపల్లి, ఆగస్టు 3: మూడు రోజులుగా వర్షాలు పడుతుండడంతో దుండ్రపల్లి చెరువు కట్టకు స్వల్పంగా గుంత పడడంతో గ్రామస్తులు వెంటనే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ పుష్పలత కట్ట వద్దకు చేరుకుని మరమ్మతులు చేయించారు. ఆమె వెంట ఆర్ఐ ప్రభాకర్, బాలయ్య, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి విప్ పరామర్శ

రుద్రంగి, సెప్టెంబర్ 3: మండల కేంద్రానికి చెందిన ఎర్రం లక్ష్మీదేవమ్మ మంగళవారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు చెలుకల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, మోహన్, లింగం, నారాయణ ఉన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు పరిశీలన

చందుర్తి, సెప్టెంబర్3: ఎవర్వాలతో కట్ట లింగంపేట బస్టాండ్ ప్రాంతంలోని రహదారి కొట్టుకుపోయింది. మంగళవారం ఇరిగేషన్ అధికారులు రోడ్డును పరిశీలించారు. వరద ఉధృతి తగ్గాక కాలువ మరమ్మతులు చేపడుతామని అధికారులు తెలిపారు. ఇక్కడ ఇరిగేషన్ ఏఈ నవీన్, డీఈ ప్రశాంత్, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్ఐపై కేసు నమోదు

తెలంగాణ చౌక్, ఆగస్టు 3: సిరిసిల్ల పట్టణంలోని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్(ఆర్ఐ) సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని మండల రెవెన్యూ ఆఫీస్‌లో ఆర్ఐగా విధులు నిర్వర్తించే సంతోష్ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల తనిఖీల్లో భాగంగా పట్టుకున్న ట్రాక్టర్ల యజమానుల దగ్గర ప్రభుత్వ చలాన్లకు అదనంగా డబ్బులు వసూళ్లు చేసి.. ఎలాంటి రసీదు ఇవ్వడం లేదని ట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కత్తెర వరణ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆర్ఐపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉపాధిహామీ పనుల బాధ్యత కార్యదర్శులదే

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో శేషాద్రి

రుద్రంగి, సెప్టెంబర్ 3: గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనుల పూర్తి బాధ్యత కార్యదర్శులదేనని డీఆర్డీవో శేషాద్రి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించగా, ఆయన హాజరయ్యారు. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రికవరీ, జరిమానా విధించారు. మండలంలో రూ.2.60 కోట్లతో పనులు చేపట్టినట్టు వెల్లడించారు. ఇక్కడ విజిలెన్స్ ఆఫీసర్ రామారావు, డీఈ పవణకుమారి, ఏఈ మనోహర్, ఎంపీడీవోలు శంకర్, నటరాజ్, ఎంపీవో సుధాకర్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

పాక్సో యాక్ట్‌పై అవగాహన

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 3: తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లోని కేజీబీవీ పాఠశాల, ఇందిరమ్మ కాలనీలోని బాలికల గిరిజన పాఠశాలలలో మంగళవారం పొక్సో యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. బాలలపై లైంగిక వేధింపుల నివారణకు తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. ఇక్కడ ఎస్‌వో శ్యామల, ప్రిన్సిపాల్, విద్యార్థినులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

బోయినపల్లి, ఆగస్టు 3: మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు యూ డైస్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ ఎంపీడీవో జయశీల, నోడల్ అధికారి శ్రవణ్‌కుమార్, ఎంఆర్‌సీ సిబంది చంద్రమౌళి, రజిత ఉన్నారు.

ముస్తాబాద్, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూ డైస్ నిర్వహణపై ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారని మండల నోడల్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. ఇక్కడ కాంప్లెక్స్ హెచ్ఎం రాధాకిషన్‌రావు, రాజేశ్వరి, హెచ్ఎంలు, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు ఉన్నారు.

ఆలయాల్లో చోరీ

గంభీరావుపేట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని ఎల్లమ్మ, మహంకాళీ అమ్మవారి ఆలయాల్లో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లోని హుండీల్లో గల రూ.15వేలువైన నగదు, మూడు గ్రాముల బంగారు ముక్కుపుడక, సీసీ పుటేజీల హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

వర్షానికి కూలిన ఇళ్లు

గంభీరావుపేట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో గాదం దేవవ్వకు చెందిన ఇల్లు మంగళవారం సాయంత్రం కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇంటి ముందటి భాగం పూర్తిగా కూలిపోయిందని దేవవ్వ ఆవేదన చెందారు.

క్రీడా దుస్తులు అందజేత

కోనరావుపేట, సెప్టెంబర్ 3: సుద్దాల గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు బీఆర్ఎస్ నేత కచ్చకాయల మహేశ్ మంగళవారం రూ.5వేల విలువైన క్రీడా దుస్తులు అందజేశారు. ఇక్కడ మాదిగ సంఘం అధ్యక్షుడు దొబ్బల దేవయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఓద్యారపు శంకర్, నాయకులు దొబ్బల సంజీవ్, భూమేశ్ ఉన్నారు.

పెండ్లయిన నెలరోజులకే..

- న్యూమెనియాతో యువకుడి మృతి
- నారాయణపూర్‌లో విషాదం

ఫారూక్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: నారాయణపూర్‌కు చెందిన మహ్మద్ ఇమాం-హమీదా దంపతుల చిన్న కుమారుడు మహ్మద్ ఫారూక్ (28)కు గత జూలై 26న పెండ్లి జరిగింది. పెండ్లయిన కొద్ది రోజుల తర్వాత ఫారూక్ నీరసంగా ఉండడంతో కుటుంబ సభ్యులు దవాఖానలో పరీక్షలు చేయించగా, న్యూమోనియా అని తేలింది. చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. చికిత్స కోసం రూ.20లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పోతిరెడ్డిపల్లిలో ఎలుగుబంటి సంచారం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: పోతిరెడ్డిపల్లిలో ఎలుగుబంటి కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వెనక ఉన్న చెనిమేని నర్సయ్యకు చెందిన పాడుబడిన బావిలో సోమవారం ఉదయం ఎలుగుబంటి అరుపులు విన్న గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజర్ మోహన్‌లాల్, సిబ్బంది బావి వద్దకు చేరుకున్నారు. బావి పూర్తిగా పొదలతో నిండి ఉండడంతో అటుగా ఎవరూ రాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు బావిలో నాలుగు నిచ్చెనలు వేసి పహారా కాశారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. రాత్రి ఎలుగుబంటి నిచ్చెన సాయంతో బయటకు వెళ్లినట్లు అధికారులు నిర్ధారించడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

వీర్నపల్లి, సెప్టెంబర్ 3: లాల్‌సింగ్‌తండాలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మంగళవారం గొర్రెలమందపై దాడి చేయగా, భూక్యా హ